# శాసన పరిచయం

**డా॥ నాగోలు కృష్ణారెడ్డి**
ఆచార్యులు
ప్రాచీన భారతదేశచరిత్ర, సంస్కృతి
పురావస్తు శాఖ
శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి – 517502

**ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ తో**

**ఎమెస్కో**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ముందుమాట | 5 |
| 2. | పరిచయం | 11 |
| 3. | నా మాట | 12 |
| 4. | కృతజ్ఞతలు | 15 |
| 5. | ఒకటో అధ్యాయం | 17 |
| 6. | శాసన స్వరూపం | 17 |
| 7. | శాసనాలలోని భాషలు – లిపులు | 57 |
| 8. | చరిత్ర నిర్మాణంలో శాసనాలు పాత్ర | 75 |
| 9. | తెలుగులో శాసన పరిణామం | 97 |
| 10. | ముగింపు | 106 |
| 11. | ఉపయుక్త గ్రంథాలు | 109 |

ఒకటో అధ్యాయం

# శాసన స్వరూపం

**శాసనం అంటే ఏమిటి?**

శాసనం అంటే శాసించేది అని అర్థం. అయితే మనం ఈ పదాన్ని ఇంగ్లీషులో 'Inscription' అనే పదానికి సమానార్థకంగా వాడుకుంటున్నాం. Inscription అంటే రాయి మీద కానీ, లోహపు రేకు మీద కానీ, కొయ్యవంటి గట్టి పదార్థాల మీద కానీ చెక్కబడిన రాత అని అర్థం. ఈ విధంగా చెక్కబడిన రాత చాలాకాలం నిలిచి ఉంటుంది. అశోకుడు (క్రీ.పూ. 269–232) శాశ్వతంగా ఉంటాయన్న ఉద్దేశంతోనే తన 'ధర్మలిపు' లను శిలలపై చెక్కించినట్లు పేర్కొంటాడు. Inscription లేదా శాసనం అంటే ఈ అర్థం చెప్పుకోవడం వలన శాసన పరిధిలోకి తాళపత్ర గ్రంథాలు చేరవు.

ఈ శాసనాలను ఎవరు, ఎప్పుడు, ఎందుకు వేయించారు అనేవి సహజంగా వచ్చే ప్రశ్నలు. వేద కాలం నుంచీ మనకు లిపి తెలుసుననే ఒక అభిప్రాయం ఉంది. కానీ అత్యంత ప్రాచీనమైన లిఖిత ప్రతులు ఏవీ లభ్యం కావడం లేదు. అయితే ప్రాచీనులు తాళపత్రాల మీదా, భూర్జపత్రాల మీదా రచనలు చేసేవారనడానికి బలమైన సాక్ష్యాలున్నాయి, కాలక్రమేణా వాతావరణ పరిస్థితుల వలన ఇవి నశించి పోవడం చేత మనకు లభ్యం కావడం లేదు. ఈ నేపథ్యంలో పైన అశోకుడు చెప్పిన మాటలను మనం అర్థం చేసుకోవలసి ఉంటుంది. అశోకుని కాలానికి ముందే చెదురుమదురుగా శాసనాలున్నా అశోకుడి శిలాశాసనాలనే మొట్టమొదటి శాసనాలుగా చరిత్రకారులు భావిస్తున్నారు. దానికి కారణం శాసన రచనా ప్రక్రియ అశోకుడి కాలం నుంచే విరివిగా వ్యాప్తిలోకి రావడమే. అందుకే అశోకుని శాసన పితామహునిగా చరిత్రకారులు భావించారు. అశోకుడి కాలం నుండీ దాదాపు 19వ శతాబ్ది వరకూ శాసన రచనా ప్రక్రియ సాగింది.

ప్రాచీన శాసనాలు ఆ కాలంనాటి లిపిలోనే ఉన్నాయి. ఉదాహరణకు అశోకుడి శాసనాలు క్రీస్తు పూర్వపు మూడో శతాబ్దినాటి బ్రాహ్మీలిపిలో ఉన్నాయి. అశోకుడు విశాలమైన సామ్రాజ్యానికి పాలకుడు. భారతదేశం మొత్తం (అస్సాం, తమిళనాడు,

కేరళ తప్ప) పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లోని కొన్ని భాగాలు అశోకుని సామ్రాజ్యంలో అంతర్భాగాలు. ఈ విశాల సామ్రాజ్యమంతా అశోకుడు శాసనాల్ని చెక్కించాడు. భారతదేశంలో లభించిన అశోకుని శాసనాలన్నీ బ్రాహ్మీలిపిలో, ప్రాకృతభాషలో ఉన్నాయి. పాకిస్తాన్‌లోని మాన్షెహ్రా (Manshera), షాబాజ్ ఘర్ (Shabhazgarh)లలో లభించిన శాసనాలు ఖరోష్ఠీలిపిలో ఉన్నాయి. ఆఫ్ఘనిస్తాన్‌లోని కాందహార్‌లో లభించిన శాసనాలు అరమైక్ (Aramaic, క్రీస్తు మాతృ భాష), గ్రీకు లిపుల్లో ఉన్నాయి. అంటే ఏ ప్రాంత ప్రజలకు ఏ లిపి, ఏ భాష తెలుసునో ఆ లిపి, ఆ భాషల్లోనే అశోకుడు శాసనాల్ని చెక్కించి భాషా సిద్ధాంతానికి ఆద్యుడైనాడు. అశోకుని తరువాత భారతదేశాన్ని పాలించిన రాజవంశాలు బ్రాహ్మీలిపిలో, ప్రాకృత భాషలోనే శాసనాల్ని వేయించాయి. కాలక్రమేణా ఈ బ్రాహ్మీలిపి నుంచే భారతీయ లిపులన్నీ పుట్టాయి. ప్రాకృత భాషస్థానంలో సంస్కృతం, ఇతర ప్రాంతీయ భాషలు వాడుకలోకి వచ్చాయి. ఉత్తర భారతదేశాల్ని పాలించిన కొన్ని విదేశీ రాజవంశాలు చెదురుమదురుగా ఖరోష్ఠీ లిపిలో కొన్ని శాసనాల్ని ప్రకటించాయి. దక్షిణ భారతదేశంలో ఒక్క ఖరోష్ఠీ శాసనం కూడా లభ్యం కాలేదు. మరి ఈ లిపిని ఎవరు చదవ గలిగారనేది మనకు సహజంగా కలిగే సందేహం. నిజానికి ఢిల్లీ సుల్తాన్ ఫిరోజ్‌షా తుగ్లక్ (క్రీ.శ. 1351–88) కాలం నాటికే పండితులు ఈ లిపిని చదవలేకపోయారనే విషయం తెలుసుకున్నప్పుడు మనకు ఆశ్చర్యం కలుగుతుంది. ఫిరోజ్‌షా తుగ్లక్ నేటి హర్యానాలోని తోప్రాలో, ఉత్తర ప్రదేశ్‌లోని మీరట్‌లో ఉన్న అశోక శాసన స్తంభాలను చూచి ఆ స్తంభాల నిర్మాణాన్ని మెచ్చుకొని, క్రీ.శ. 1356లో (అంటే అశోకునికి పదహారు వందల ఏండ్ల తర్వాత) వాటిని ఢిల్లీకి తరలించినట్లు మధ్యయుగ ముస్లిం చరిత్రకారుడు షంసి సిరాజ్, 'తారిఖ్–ఇ–ఫీరూజ్‌షాహీ' అనే తన చరిత్ర గ్రంథంలో పేర్కొన్నాడు. అట్లే కౌశాంబీలోని ఒక స్తంభశాసనాన్ని అక్బర్ అలహాబాదుకు తరలించినట్లు తెలుస్తుంది. ఒక్కొక్కటి, సరాసరిన, 50 అడుగుల ఎత్తు, 50 అంగుళాల చుట్టు కొలత కలిగి, 30 నుంచి 50 టన్నుల బరువు ఉన్న ఈ స్తంభ శాసనాలలో, తోప్రాలో లభించిన దానిని ఢిల్లీ చేర్చటానికి ఫీరూజ్‌షా చేసిన విశేష ప్రయత్నాలను షంసి సిరాజ్ పేర్కొన్నాడు. తోప్రా స్తంభాన్ని ఢిల్లీ చేర్చటానికి, ఫీరూజ్‌షా, 42 చక్రాలతో ఒక పొడవైన బండిని తయారు చేయించాడనీ, ఒక్కో చక్రానికి కట్టిన మోకును 200 మంది మనుషుల చొప్పున లాగి, ఆ స్తంభాన్ని యమునా తీరానికి చేర్చారని, దాదాపు 5000 నుంచి 7000 మణుగుల ధాన్యాన్ని మోయగల, పెద్ద పడవలు చాలా వాటి మీద దానిని యమున దాటించి ఢిల్లీ (ఫిరోజాబాద్)కి చేర్చారని షంసి సిరాజ్ తెలుపుతాడు. ఇట్టి ప్రయత్నమే చేసి మీరట్ వద్ద ఉన్న అశోక స్తంభ శాసనాన్ని కూడా ఫీరూజ్ ఢిల్లీకి